క్లుప్తంగా

ఉపాధి పనులను గుర్తించాలి


మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ ఎంపీడీఓ వెంకటరమణ

తనకల్లు: ఉపాధి హామీ కింద గ్రామాల్లో చేపట్టబోయే పనులను గుర్తించాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ వెంకటరమణ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 17 గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ఈ నెల 23న గ్రామ సభలను ఏర్పాటు చేయాలన్నారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా 2024–25 ఏడాదికి గాను 46 రకాల వ్యవసాయ అనుబంధ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, ఉపాధి సిబ్బంది సమన్వయంగా పనిచేస్తూ కూలీలకు అవసరమైన పనులను గుర్తించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ కృష్ణమూర్తిరెడ్డి, ఏపీఓ మరియమ్మ, ఈసీ శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టూటౌన్ సీఐగా రెడ్డప్ప

ధర్మవరం అర్బన్: ధర్మవరం టూటౌన్ సీఐగా రెడ్డప్ప సోమవారం బాధ్యతలు చేపట్టారు. అనంతపురం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ నుంచి బదిలీపై ధర్మవరం టూటౌన్‌కు వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న సీఐ అశోక్‌కుమార్ పుట్టపర్తి ఎస్పీ కార్యాలయానికి బదిలీ అయ్యారు.

ఈ- క్రాప్ నమోదు చేసుకోండి

తలుపుల : ఖరీఫ్‌లో సాగు చేసిన పంట వివరాలను ఈ–క్రాప్‌లో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని ఏఓ షాదాబ్ రైతులకు సూచించారు. సోమవారం లక్కసముద్రం గ్రామంలో ఈ–క్రాప్ నమోదును ఆయన పరిశీలించారు. వేరుశనగ, కంది, టమాట, మొక్కజొన్న, మామిడి, మల్బరీ ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలని రైతులకు సూచించారు.

జీవన భృతి కల్పించండి


ఎమ్మెల్యేకు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

కదిరి అర్బన్: ఆర్టీసీలో ఉద్యోగ విరమణ పొందిన వారికి జీవన భృతి కింద రూ.7,500 పెన్షన్ సదుపాయం కల్పించాలని రిటైర్డ్ ఉద్యోగులు సోమవారం ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలోరిటైర్డ్ ఉద్యోగులు గోపాలకృష్ణ, బాషా, సురేంద్రరెడ్డి, హరిమోహన్, షమీవుల్లా, శ్రీరాములు పాల్గొన్నారు.

ఇంటి స్థలాలు కేటాయించండి


ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

ముదిగుబ్బ: రాళ్లనంతపురం క్రాస్ సమీపంలో పేదలకు ఇంటి స్థలాలు కేటాయించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలని ధర్నా చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఇన్‌చార్జ్ తహసీల్దార్ మునిస్వామికి అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు నరసింహులు, మండల కార్యదర్శి ఆటో పెద్దన్న, బండల వెంకటేష్, పోతులయ్య పాల్గొన్నారు.

వినాయకచవితిని సంతోషంగా చేసుకుందాం

కదిరి టౌన్: సెప్టెంబర్‌లో వినాయక చవితి పండుగను అందరూ కలిసికట్టుగా సంతోషంగా జరుపుకుందామని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పిలుపునిచ్చారు. సోమవారం కదిరి ఆర్డీఓ కాన్ఫరెన్స్ హాల్‌లో ఏర్పాటు చేసిన శాంతికమిటీ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. విగ్రహాల ఊరేగింపు సమయంలో విద్యుత్ వైర్లు తగలకుండా కిందనే అమర్చే విధంగా వచ్చే సంవత్సరంలో ఏర్పాటు చేయిస్తామని తెలిపారు. చవితి ఉత్సవాల నిర్వహణపై సూచనలు, సలహాలు అందజేశారు. కార్యక్రమంలో ఆర్డీఓ సన్నీ వంశీకృష్ణ, డీఎస్పీ శ్రీలత, మాజీ ఎంపీ నిజాం, మాజీ ఎమ్మెల్యే పార్థసారథి, మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్, తహసీల్దార్ మురళీకృష్ణ పాల్గొన్నారు.

కమనీయం కల్యాణోత్సవం

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో సోమవారం సాయంత్రం శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాస కల్యాణ మహోత్సవం కమనీయంగా సాగింది. మంత్రి సత్యకుమార్, టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్, జనసేన ఇన్‌చార్జ్ చిలకం మధుసూదన్‌రెడ్డి హాజరయ్యారు.

రస్తా విషయంలో ఘర్షణ

నల్లచెరువు: కె.పూలకుంటలో ఆంజనేయులు, గణేష్ కుటుంబ సభ్యులు, అలాగే అదే గ్రామానికి చెందిన రమేష్ శ్రీనివాసులు, లక్ష్మీదేవి సోమవారం పొలంలోకి వెళ్లే రస్తా విషయంలో గొడవపడ్డారు. కర్రలు, రాళ్లతో పరస్పరం దాడి చేసుకుని తీవ్రంగా గాయపడ్డారు.

ప్రజారోగ్యంపై నిర్లక్ష్యం


సున్నపుగుట్టతండాలో రోడ్డుపైనే చెత్త

- గ్రామాల్లో పడకేసిన పారిశుధ్యం
- మూలనపడ్డ చెత్త తరలింపు ఆటో, రిక్షాలు
- నిరుపయోగంగా ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాలు

కదిరి అర్బన్: స్వచ్ఛ భారత్ సంకల్పానికి అధికారులు తూట్లు పొడుస్తున్నారు. పారిశుధ్యం పేరుకుపోయి దోమల బెడదతో ప్రజలు అనారోగ్యాలబారిన పడుతున్నారు. కొన్ని గ్రామాల్లో చెత్తసేకరణ కార్యక్రమం నిలిచిపోయి రోడ్లపైనే చెత్త పడేస్తున్నారు. మండల వ్యాప్తంగా 12 పంచాయతీల్లో చెత్త సేకరించే రిక్షాలు 50 ఉన్నాయి. వీటిలో 90 శాతం పైగా పని చేయడంలేదు. ఆటో రిక్షాలు ఐదు ఉండగా.. అందులో ఒక ఆటోతో మాత్రమే చెత్త సేకరణ చేస్తున్నారు.

■ వినియోగంలో లేని ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాలు

తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి చెత్త సంపద తయారీ కేంద్రాల్లో వీటిని సైక్లింగ్ చేసి ఎరువులను తయరు చేసేందుకు ప్రభుత్వం రూ.లక్షలు ఖర్చు పెట్టి నిర్మించిన ఎస్‌డబ్లూపీసీ కేంద్రాలు నిరుపయోగంగా మారాయి. మండలంలో ఒకటి రెండు మాత్రమే చెత్త సంపద తయారీ కేంద్రాలు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. ఇటీవల జిల్లా పంచాయతీ అధికారి విజయ్‌కుమర్ ఈ కేంద్రాలను తనిఖీ చేశారు. వాటిని ఎందుకు వినియోగంలోకి తీసుకురాకుండా ఉన్నారని పంచాయతీ కార్యదర్శులపై అసహనం వ్యక్తం చేశారు.


కుమ్మరవాండ్లపల్లిలో మరమ్మతుకు గురైన ఆటో రిక్షా

■ క్లాప్ మిత్రలేరీ..?

గ్రామాల్లో చెత్తను సేకరించేందుకు నియమించిన క్లాప్ (క్లీన్ ఆంధ్రప్రదేశ్) మిత్రలు చాలా మందికి సకాలంలో జీతాలు రాక పని మానేసి వేరేపనులు చేసుకుంటున్నారు. దీంతో చెత్తసేకరణ కార్యక్రమం చాలా చోట్ల ఆగిపోయింది.

■ యాప్ నిర్వహణ గాలికి..

పీఆర్ యాప్‌లో డ్రెయినేజీ క్లీనింగ్, గార్బేజ్ పాయింట్, వాటర్ స్టాగ్నేషన్, ట్యాంకులు శుభ్రం చేయడం వంటివి ఎప్పటికప్పుడు నమెదు చేయాలి. అలాంటివేవీ నిర్వహించడం లేదని తెలుస్తోంది.

■ ఫాగింగ్ జాడేదీ..?

వర్షాకాలంలో దోమల బెడద ఎక్కువైంది. పలువురు విషజ్వరాల బారిన పడుతున్నారు. దోమలు అరికట్టేందుకు పంచాయతీలో ఫాగింగ్ చేయాలి. ఈ ఏడాదిలో ఇంతవరకు ఫాగింగ్ నిర్వహించిన జాడేలేదు.

గ్రామ పంచాయతీ	ట్రై సైకిల్స్	మంజూరైనవి కొత్తవి
కాళసముద్రం	4	1
కుమ్మరవాండ్లపల్లి	8	1
కొండమ నాయునిపాళెం	1	1
మొటుకుపల్లి	2	1
ముత్యాలచెరువు	5	1
కదిరి బ్రాహ్మణపల్లి	4	1
పట్నం	5	1
చలమకుంట్లపల్లి	1	1
కదిరి కుంట్లపల్లి	1	1
బూరుగుపల్లి	1	1
యర్రదొడ్డి	2	1
ఎగువపల్లి	2	1
మొత్తం	36	14

చెత్త సేకరణతోనే శుభ్రత



పారిశుధ్య సిబ్బంది ఇంటికి వచ్చి తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరుగా సేకరిస్తే గ్రామం పరిశుభ్రంగా ఉంటుంది. వారు రాకపోవడంతో వీధిమూలన, రోడ్లపైనే చెత్తను పడేస్తున్నారు. దీంతో చెత్తదిబ్బలు తయారై దుర్గంధం వెదజల్లుతున్నాయి.

– చంద్రమౌళిరెడ్డి, నడింపల్లి

కొన్ని కేంద్రాలే పని చేస్తున్నాయి

మండలంలో కొన్ని మాత్రమే చెత్త సంపద తయారీ కేంద్రాలు పని చేస్తున్నాయి. క్లాప్ మిత్రలు గతంలో 37 మంది ఉండేవారు. ప్రస్తుతం ఏడుగురు పని చేస్తున్నారు. జీతాల సమస్యతో మిగిలిన వారు వెళ్లిపోయారు. త్వరలోనే క్లాప్‌మిత్రలను తీసుకుంటాం. ఫాగింగ్ త్వరలోనే నిర్వహిస్తాం.

– అంజనప్ప, ఎంపీడీఓ, కదిరి

అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక రాఖీ

బత్తలపల్లి: అన్నా చెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక అయిన రాఖీ వేడుకలను సోమవారం మండల వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ప్రతి అక్కాచెల్లెళ్లు తమ సోదరులకు రాఖీలు కట్టి స్వీట్లు తినిపించారు. శుభగడియలు మధ్యాహ్నం నుంచి ప్రారంభం కావడంతో చిన్నారులు ఒకరినొకరు రాఖీలు కట్టుకున్నారు. ఏటా శ్రావణమాసంలో వచ్చే పౌర్ణమి రోజున ఈ వేడుకలు నిర్వహిస్తుంటారు. చిన్నారులు మొదలుకొని పెద్దల వరకు తమ సోదరులకు రాఖీలు కట్టి ఆశీర్వాదాలు పొందారు.


బత్తలపల్లిలో సోదరులకు రాఖీ కడుతున్న సోదరీమణులు

ప్రైవేట్ స్కూల్స్‌లో ఘనంగా రక్షాబంధన్

బత్తలపల్లిలోని శ్రీజ్యోతి హైస్కూల్, విజేత, విద్యాధరి తదితర ప్రైవేట్ పాఠశాలల్లోనూ రక్షాబంధన్‌ను పురస్కరించుకొని చిన్నారులతో కేక్ కట్ చేయించి రాఖీలు కట్టించారు.

ఘనంగా రాఖీ పౌర్ణమి

ధర్మవరం అర్బన్: పట్టణంలోని కాకతీయ విద్యానికేతన్ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో సోమవారం రాఖీ పౌర్ణమి ఘనంగా నిర్వహించారు. కరస్పాండెంట్ శెట్టిపి నిర్మలా జయచంద్రారెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థినీ విద్యార్థులు రాఖీలు కట్టి పండుగను జరుపుకున్నారు. పాఠశాల డైరెక్టర్లు శెట్టిపి సూర్యప్రకాష్ రెడ్డి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రేమ, ఆప్యాయతలతో రక్షా బంధన్

తాడిమర్రి: యువతీ, యువకులు రక్షా బంధన్ వేడుకలను ప్రేమ, ఆప్యాయతలతో జరుపుకున్నారు. రాఖీ పౌర్ణమిని పురస్కరించుకొని సోమవారం తాడిమర్రి, మోదుగులకుంట, పెద్దకోట్ల, పిన్నదరి, నిడిగల్లు, దాడితోట, కునుకుంట్ల, తదితర గ్రామాల్లో అక్కలు తమ్ముళ్లకు, చెల్లెళ్లు అన్నలకు రాఖీలు కట్టారు.

తూముచెర్ల రోడ్డు బాగు చేయిస్తాం

సాక్షి ఎఫెక్ట్..

కనగానపల్లి: గుంతలమయంగా ఉన్న తూముచెర్ల–అనంతపురం రహదారికి వెంటనే మట్టి వేయించి రోడ్డును బాగు చేయిస్తామని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత తెలిపారు. మండలంలోని తూముచెర్ల నుంచి రంగంపేట మీదుగా అనంతపురం వెళ్లే రహదారి దుస్థితిపై సోమవారం సాక్షిలో రహదారి ఇలా.. ప్రయాణం ఎలా? అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే పరిటాల సునీత ప్రభుత్వ అధికారులతో కలసి సోమవారం మధ్యాహ్నం తూముచెర్ల గ్రామానికి వెళ్లి రహదారిని పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక గ్రామస్తులు, వాహనదారులతో మాట్లాడి రహదారి దుస్థితిపై ఆరా తీశారు. వర్షాకాలంలో ఈ రహదారి గుండా వెళ్లాలంటే చాలా ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే మట్టి పనులు చేపట్టి రహదారిపై పడిన గుంతలను పూడ్చించాలని పంచాయతీరాజ్ ఇంజినీర్లను ఎమ్మెల్యే ఆదేశించారు. అనంతరం శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి తారురోడ్డు నిర్మాణ పనులకు అంచనాలు తయారు చేయించాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ డీఈ రామచంద్రారెడ్డి, జేఈ నారాయణ స్వామి, మండల టీడీపీ నాయకులు కన్వీనర్ పోతలయ్య, నెట్టం వెంకటేష్, తూంచర్ల హరి, అంకె వన్నూరప్ప, తదితరులు పాల్గొన్నారు.


దెబ్బతిన్న రహదారిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

ఉపాధ్యాయుల సమస్యలపై వినతి

ధర్మవరం అర్బన్: ఉపాధ్యాయుల సమస్యలు తీర్చాలని మంత్రి సత్యకుమార్‌కు ఏపీటీఎఫ్ నాయకులు విన్నవించారు. పట్టణానికి వచ్చిన మంత్రిని సోమవారం నాయకులు కలిసి వినతి పత్రం సమర్పించారు. జీవో 117, 128లను రద్దు చేయాలని, ఉపాధ్యాయుల కొరత తీర్చడానికి సర్దుబాటు ప్రక్రియను కాకుండా అర్హులైన ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించడం ద్వారా ఖాళీలను భర్తీ చేయాలని, పాఠశాలల్లో ఇంగ్లిష్ మాధ్యమంలోనే కాకుండా తెలుగు మాధ్యమం కూడా సమాంతరంగా కొనసాగించాలని, నూతనంగా సీబీఎస్‌ఈ సిలబస్‌లోనికి మార్చిన పాఠశాలలను తిరిగి స్టేట్ సిలబస్‌లోకి చేర్చాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోనంకి అశోక్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు కోడూరు శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి చంద్ర, రాష్ట్ర కౌన్సిలర్ బీకే ముత్యాలప్ప, సీనియర్ నాయకులు సానే రవీంద్రరెడ్డి, బలరాముడు, నాగభూషణం, రవికుమార్, కె.చంద్ర, వాసుకుమార్, శ్రీనివాసులు, ప్రసాద్, హేమంత్‌కుమార్ తదితరులు ఉన్నారు.


మంత్రి సత్యకుమార్‌కు వినతిపత్రం అందిస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

పోలీస్ కుటుంబాలకు అండగా ఉంటాం


కానిస్టేబుల్ భార్యకు చెక్ అందజేస్తున్న ఎస్పీ రత్న

పుట్టపర్తి టౌన్: మృతి చెందిన పోలీస్ కుటుంబాలకు అండగా ఉంటామని ఎస్పీ రత్న తెలిపారు. ఏఆర్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందిన కమలాకర్ భార్య ముత్యాలమ్మకు జిల్లా పోలీస్ కార్యాలయంలోని తమ చాంబర్‌లో రూ.75 వేల చెక్కును ఎస్పీ అందజేశారు. మృతి చెందిన పోలీస్ కుటుంబాలకు శాఖాపరంగా అన్ని విధాలా ఆదుకుంటామని, వారి సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని తెలిపారు. మృతుని కుటుంబానికి ఇంకా రావాల్సిన ఆర్థిక సాయాన్ని త్వరలో అందజేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ విష్ణు, ఏఆర్ డీఎస్పీ విజయకుమార్, ఏఓ సుజాత, సూపరింటెండెంట్ సరస్వతితో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా గిరి రథోత్సవం

పుట్టపర్తి టౌన్: రాఖీ పౌర్ణమిని పురస్కరించుకొని సోమవారం సాయంత్రం సత్యసాయి శ్రీగిరి రథోత్సవం వైభవంగా నిర్వహించారు. ప్రతి పౌర్ణమినాడు శ్రీగిరి రథోత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ప్రశాంతి నిలయం ముఖ ద్వారం వద్ద అందంగా అలంకరించిన సత్యసాయి చిత్రపటాన్ని రథంలో ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రథాన్ని లాగుతూ ఊరేగింపుగా ప్రశాంతినిలయం, విద్యాగిరి, గోకులం, ఎనుములపల్లి, గణేష్ కూడలి, పెట్రోల్‌బంక్, చింతతోపు, శివాలయం వీధి, హనుమాన్ కూడలి, గోవిందయ్యపేట, పెద్దబజార్ మీదుగా ప్రశాంతి నిలయానికి చేర్చారు. ఉత్సవంలో దేశ విదేశీ భక్తులు గిరిప్రదక్షిణలో అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కాటికోటేశ్వర క్షేత్రంలో ప్రత్యేక పూజలు

తాడిమర్రి: చిల్లవారిపల్లి సమీపంలోని కాటికోటేశ్వర క్షేత్రంలో సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. పూజారి మూల విరాట్‌కు వెండిగొడుగులు తొడిగి పలు రకాల పుష్పలతో అలంకరించారు. అనంతరం భక్తులు గదాగుండంలో పుణ్యస్నానాలు ఆచరించి ఆలయ ప్రదక్షిణలు చేసి, కొబ్బరికాయలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

కరాటేలో కదిరి విద్యార్థుల ప్రతిభ


కరాటేలో పతకాలు సాధించిన విద్యార్థులు

కదిరి అర్బన్: తెలంగాణ రాష్ట్రం మొయినాబాద్‌లో ఈ నెల 18న జరిగిన రెండవ జాతీయ స్థాయి కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో కదిరి విద్యార్థులు ప్రతిభ చాటారు. ఈ పోటీల్లో కదిరి విద్యార్థినులు నేహా, మహ్మద్‌షైఫ్, రీదాముస్కాన్, సుదీక్షలు బంగారు పతకాన్ని, నందితరెడ్డి, పాయల్, సనా, అల్తాఫ్ హుస్సేన్ రజత పతకం, యశ్వంత్, హవీష్, కుషల్, వర్షిత్‌రెడ్డి, జోషిత, అఫ్నాన్ కాంస్య పతకం సాధించారు. జాతీయ స్థాయి పోటీల్లో పతకాలు సాధించిన విద్యార్థులను కరాటే మాస్టర్ షాకీర్ అభినందించారు.

సంక్షిప్త సమాచారం

సీనియర్ ఫొటోగ్రాఫర్లకు సన్మానం

ధర్మవరం అర్బన్ : పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ప్రపంచ ఫోటోగ్రాఫర్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సిల్క్ సిటీ ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో సీనియర్ ఫొటో గ్రాఫర్స్ ఎంజే హరి, ఆర్‌కే మూర్తి, రామచంద్ర, అంబికా శ్రీనివాసులును శాలువాలతో సత్కరించారు. అనంతరం గొట్లూరు అనాథాశ్రమంలో పేదలకు అన్నదానం చేశారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

అమడగూరు: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను తప్పక పాటించాలని ఎస్‌ఐ వెంకటనారాయణ సూచించారు. సోమవారం బిక్కలూరు క్రాస్, తహసీల్దార్ కార్యాలయం వద్ద ముమ్మరంగా వాహనాలను తనిఖీ చేశారు.

వైభవంగా గరుడోత్సవం

ధర్మవరం అర్బన్: పట్టణంలోని లక్ష్మీచెన్నకేశవ స్వామి ఆలయంలో సోమవారం సాయంత్రం పౌర్ణమి సందర్భంగా గరుడోత్సవం నిర్వహించారు. ఈఓ వెంకటేష్ సమక్షంలో గరుడ వాహనంపై లక్ష్మీచెన్నకేశవస్వామి ప్రత్యేక పూల మధ్య కొలువుదీరి పురవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు.


చిరు ధాన్యాల సాగు లాభదాయకం

తనకల్లు: చిరు ధాన్యాల సాగు లాభదాయకమని వ్యవసాయాధికారి (ఏఓ) శ్రీహరినాయక్ అన్నారు. మార్పురివాండ్లపల్లిలో జనజాగృతి సంస్థ ఆధ్వర్యంలో సోమవారం బీడు భూములలో చేపట్టిన చిరుధాన్యాల సాగును ఏఓ ప్రారంభించారు.

ఓటరు సర్వే పక్కాగా చేపట్టాలి

కనగానపల్లి: 2025లో జరిగే పంచాయతీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో ఓటరు సర్వేను పక్కాగా చేపట్టాలని తహసీల్దార్ రమాదేవి బీఎల్‌ఓలను ఆదేశించారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌ఓ, రెవెన్యూ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటా చేపట్టే ఓటరు సర్వేపై బీఎల్‌ఓలకు పలు సూచనలు అందించారు.

ఓ వైపు ఎండ.. మరో వైపు వర్షం



బత్తలపల్లి: మండల కేంద్రమైన బత్తలపల్లిలో సోమవారం మధ్యాహ్నం విచిత్రమైన సన్నివేశం నెలకొంది. మధ్యాహ్నం రెండు గంటల సమయంలో ఎండ విపరీతంగా కాస్తోంది. ఇదే సమయంలో వర్షం కురుసింది. అంత ఎండలోనూ వర్షం కురుస్తుండడంతో ప్రజలు ఆశ్చర్యపోయారు. ఇలా 15 నిమిషాల పాటు వర్షపు జల్లులు పడ్డాయి.

వర్గీకరణతో విడగొట్టొద్దు

పుట్టపర్తి అర్బన్: ఎస్సీ వర్గీకరణ పేరుతో కులాలను విడగొట్టి రిజర్వేషన్ కల్పించడం సరికాదని మాల మహానాడు నాయకులు తప్పుపట్టారు. సోమవారం మాల మహానాడు నాయకులు కలెక్టరేట్‌కు విచ్చేసి ప్రధాన ద్వారం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు వెలువరించిన తీర్పు రాజ్యాంగానికి విరుద్ధంగా ఉందన్నారు. తరతరాలుగా అన్నదమ్ములుగా ఉంటున్న ఎస్సీలను విడగొట్టి రాజకీయ లబ్ధి పొందాలని చూడడం అవివేకమన్నారు. ఈ నెల 21న దళిత సంఘాలన్నీ కలిసి భారత్ బంద్‌కు పిలుపునిచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర నాయకులు ఈశ్వరయ్య, జిల్లా నాయకులు గంగులయ్య, లక్ష్మీనారాయణ, మనోహర్, అంజనేయులు, గంగాధర్, నాగేంద్ర, వెంకటరాముడు, వేణుగోపాల్, హనుమంతు, అబ్రహాం, సురేష్, జయచంద్ర, పుష్పరాజ్, మహేష్, నరసింహులు, గౌరమ్మ పాల్గొన్నారు.

21న బంద్ విజయవంతం చేయండి

పుట్టపర్తి: మాల మహానాడు ఆధ్వర్యంలో ఈ నెల 21న చేపట్టే భారత్‌బంద్‌ను విజయవంతం చేయాలని జిల్లా కమిటీ పిలుపునిచ్చింది. కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ వర్గీరణ విషయంలో రాష్ట్రాలకు అధికారం ఉందంటూ సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు రాజ్యాంగ విరుద్ధమన్నారు. ధర్నాకు ప్రజాసంఘాలు, ఉద్యోగులు, విద్యార్థులు తరలిరావాలన్నారు.

రస్తా చూపాలని వినతి


తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

చెన్నేకొత్తపల్లి: చిన్నమొగలాయపల్లి నుంచి కనుముక్కలలోని జెడ్పీ హైస్కూల్‌కు వెళ్లేందుకు విద్యార్థులు, ప్రజల రాకపోకల సౌకర్యార్థం రస్తా చూపాలని గ్రామస్తులు కోరారు. సోమవారం ఇన్‌చార్జ్ తహసీల్దార్ అనురాధను కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. కనుముక్కల నుంచి చిన్నమొగలాయపల్లి, అలాగే చిన్నమొగలాయపల్లి నుంచి మేడాపురం ధర్మవరం గ్రామాలకు వెళ్లే బస్సు రోడ్డు గత కొన్నేళ్లుగా ప్లాన్‌లో రస్తా ఉందన్నారు. గతంలో ఈ మార్గంలో కనుముక్కలలోని జెడ్పీ హైస్కూల్‌కు విద్యార్థులు రాకపోకలు సాగించేవారని తెలిపారు. అయితే మేడాపురానికి చెందిన పుల్లరామన్న రస్తాకు అడ్డంగా జేసీబీ సాయంతో గుంత తవ్వడంతో ఇబ్బందిగా మారిందని పేర్కొన్నారు. స్కూల్‌కు వెళ్లేందుకు విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. స్పందించిన తహసీల్దార్.. విచారణ చేసి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

విద్యార్థులకు పరుగు పందెం పోటీలు రేపు

పుట్టపర్తి అర్బన్: జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 21న కొత్తచెరువులో పరుగు పందెం పోటీలు నిర్వహించనున్నట్లు ఆత్మీయ ట్రస్ట్ చైర్మన్ శెట్టిపి జయచంద్రారెడ్డి తెలిపారు. సోమవారం కొత్తచెరువులోని డీఈఓ కార్యాలయంలో పోటీలకు సంబంధించిన బ్రోచర్లను డీఈఓ మీనాక్షి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొత్తచెరువు, బుక్కపట్నం, పుట్టపర్తి మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభ్యాసం చేస్తున్న 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు అండర్– 14, అండర్– 17 విభాగాల్లో 100, 200 మీటర్ల పరుగు పోటీలు ఉంటాయన్నారు. విద్యార్థి దశలోనే పిల్లల్లో క్రీడా నైపుణ్యం వెలికి తీయడానికి పరుగు పందెం పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీలను మూడు మండలాల ఉపాధ్యాయులు, పీడీలు విద్యార్థులు జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు వెంకటరమణ, భాస్కర్, లక్ష్మీనారాయణ, బాబు, బాబావలి, తదితరులు పాల్గొన్నారు.

అర్థమయ్యేలా బోధించండి

చెన్నేకొత్తపల్లి: ప్రభుత్వ బడుల్లో చదువుతున్న విద్యార్థులకు పాఠాలు సులభంగా అర్థమయ్యేలా సరళరీతిలో బోధించాలని ఎంఈఓ–1 మున్వర్ బాషా, ఎంఈఓ–2 ప్రసూన్ కుమార్ నాయుడు ఆదేశించారు. సోమవారం మండల పరిధిలోని న్యామద్దెల కాంప్లెక్ పరిధిలోని పాఠశాల ఉపాధ్యాయులకు న్యామద్దెల ఉన్నత పాఠశాలలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓలు మాట్లాడుతూ.. విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచాలన్నారు.

క్యాంటీన్‌లో అధిక ధరలపై ఫిర్యాదు

ధర్మవరం అర్బన్: రంగా సినీ సెంట్రల్ సినిమా హాల్ క్యాంటీన్‌లో తినుబండారాలు అధిక ధరలకు విక్రయిస్తున్నారని, థియేటర్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రసాద్, న్యాయవాదులు పెద్దన్న, వెంకట్రామిరెడ్డి, నరసింహమూర్తి, మోహన్ ప్రసాద్, మణికంట, సంధ్య డిమాండ్ చేశారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ నటరాజ్‌కు ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ సభ్యులు వినతిపత్రం అందించారు.